శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**చిల్లకూరు, జూన్ 22, ప్రభాతవార్త** స్థానిక చిల్లకూరు గ్రామంలోని డానియల్ చిల్డ్రన్ హోమ్ నందు సోమవారం మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సతుకుమాటి సుధీర్ రెడ్డి కుమారుడు సతుకుమాటి అఖిల్ రెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా 60 మంది విద్యార్థులకు అఖిల్ రెడ్డి అక్క అయినటువంటి సత్కుమాటి ప్రగతి రెడ్డి చేతుల మీదగా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించడం జరిగింది. అనంతరం మంచి అల్పాహార విందు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కండలేరులో 33.990 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 22 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో సోమవారం ఉదయానికి 33.990 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 1230 క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 815 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, మెప్మా పి.డి.కిరణ్ కుమార్, ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు. ప్రత్యేక క్యూ లైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత భోజన సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉంచారు. రెవిన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయగా, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు కేశవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సంతృప్తే లక్ష్యంగా రొట్టెల పండుగకు ఏర్పాట్లు

- అధికారులందరూ సమర్థవంతంగా పనిచేసి రొట్టెల పండుగను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- భక్తుల అపార నమ్మకం, విశ్వాసానికి ప్రతీక నెల్లూరు రొట్టెల పండుగ
- పరిశుభ్రత, భద్రత, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు మంత్రి నారాయణ దిశా నిర్దేశం



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – వైద్యం** దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రొట్టెల పండుగను విజయవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. జూన్26 నుంచి 30వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో జరగనున్న రొట్టెల పండుగ ఏర్పాట్లపై సోమవారం దర్గా ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా పోలీసు అధికారి అజిత వేజెండ్ల, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర మేయర్ సుజాత, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి నారాయణ మాట్లాడుతూ** రొట్టెల పండుగ భక్తుల విశ్వాసానికి, నమ్మకానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తుండటంతో వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దర్గా ప్రాంగణం, స్వర్ణాల చెరువు ఘాట్లు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత, భద్రత, తాగునీరు, రాకపోకల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నిఘా పరికరాలను ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక, మత్స్య, విద్యుత్ శాఖల సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, మున్సిపల్ అధికారులు భక్తులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దర్గా అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. గతంలో తమ హయాంలో దర్గా అభివృద్ధికి పలు పనులు చేపట్టామని, ప్రస్తుతం ముఖ్యమంత్రి మంజూరు చేసిన ఐదు కోట్ల రూపాయలతో ప్రార్థనా మందిరం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం పడవ విహార సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కసుమూరు, ఏఎస్పేట, బారాషహీద్ దర్గాలను అనుసంధానిస్తూ ఒక పర్యాటక వలయంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. రొట్టెల పండుగ విజయవంతం కావడానికి ప్రతి శాఖ సమష్టిగా పనిచేసి భక్తులందరూ సంతృప్తి చెందేలా చూడాలని సూచించారు.

❖ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రొట్టెల పండుగ పవిత్రమైన పండుగ మాత్రమే కాకుండా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రొట్టెల పండుగ నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నామని, అన్ని శాఖల అధికారులకు విధులు కేటాయించి ఏర్పాట్లను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులందరికి తెలిసేలా సమాచార శాఖ ద్వారా మీడియాలో తెలిపే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు దర్గా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, దర్గా కమిటీ చైర్మన్ మునీర్ బాష, నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, అదనపు పోలీసు అధికారులు దీక్ష, సౌజన్య, రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అవినీతికి ఎత్తి చూపితే విద్యాసంస్థలపై దాడులు చేయటం దారుణం

- రాజకీయంగా ఎదుర్కోలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసేందుకు కుట్ర
- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగుతుంది
- కక్ష్యా రాజకీయాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- కూటమి పాలనపై ధ్వజమెత్తిన వైకాపా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు








**నెల్లూరు, జూన్22 ప్రభాతవార్త–విద్య** దేశవ్యాప్తంగా బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు అవుతుంటే మన ఆంధ్రాలో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని, రాష్ట్రంలో డిఎస్సీ పేరుతో జరిగిన భారీ అవినీతిని వెలుగులోకి తెచ్చి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించి నందుకే తమ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కి చెందిన కృష్ణచైతన్య కళాశాలలపై అధికారులు దాడులు చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు పేర్కొన్నారు. సోమవారం చంద్రశేఖర్‌రెడ్డి కళాశాలలపై జరిగిన దాడుదలకు నిరసనగా రాష్ట్రంలోని వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నెల్లూరు నగరానికి చేరుకున్నారు. తోలుత నగరంలోని స్థానిక రాంజీ నగర్‌లోని వైకాపా నగర ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయనికి చేరుకున్నారు. వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అక్కడ నుండి స్థానిక విఆర్‌సి సెంటర్ వరకు భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం విఆర్‌సి సెంటర్‌లోని డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కృష్ణచైతన్య విద్యాసంస్థలపై ప్రభుత్వ చేయించిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు.

**ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతు** కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతి మెగా డిఎస్సీని బయపెట్టి నిజా నిజాలు మాట్లాడుతున్నందుకు నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య విద్యాసంస్థలకు చెందిన ఆరు కళాశాలలపై శనివారం రాత్రి ఒక్కసారిగా అధికారులు దాడులు చేయటం నీతి మాలిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. 16వేల మంది విద్యార్థులతో 500మందికి పైగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో దాదాపు రెండు దశాబ్దాలుగా నెల్లూరులో ఉన్న విద్యాసంస్థలపై ప్రస్తుతం అధికారులు దాడులు నిర్వహిచటం విడ్డూరంగా ఉందన్నారు. ఇది పూర్తిగా కక్ష్య సాధింపు చర్యలో భాగమేని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన ఉంటూ అవినీతిని ఎదరించటం తప్పా అని ప్రశ్నించారు. పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కక్ష్య రాజకీయాలను చేసిందన్నారు. వ్యక్తిగత స్వార్ధం కోసం సంస్థలను కూటమి ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాను ఎదిరిస్తూ ముందకు వస్తున్న వైకాపా నేతలను చూస్తే తట్టుకోలేక పోతుందని, వారిని ఆర్థికంగా, మానశికంగా ఇబ్బందులకు గురిచేసేందకు కుట్ర పన్నుతుందన్నారు. ఇటువంటి దాడులకు తాము భయపడబోమని తెలిపారు. ఇది మంచి పద్దతి కాదని హితవు పలికారు.

**ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతు** నెల్లూరు నగరంలో 70 కి పైగా జూనియర్ కళాశాలలు ఉంటే కేవలం కృష్ణచైతన్య విద్యాసంస్థలపై దాడులు చేయటం కక్ష్యా రాజకీయాలనేని స్పష్టం చేశారు. ఆయా విద్యాసంస్థల పై జరిగిన దాడులు చూస్తుంటే ప్రతిపక్ష పార్టీ గోంతు నొక్కేందుకు చేస్తున్న కుట్రేనని అర్ధమౌతుందన్నారు. ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, రవిబాబు, కల్పలతలు మాట్లాడుతు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి తమ పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 11 ఎమ్మెల్యేలు , 19మంది మ్మెల్సీలు పార్టీ నాయకులు ఒక్క పిలుపుతో నెల్లూరుకు రావటం జరిగిందన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

**జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతు** కూటమి ప్రభుత్వం దిగజారుదు రాజకీయాలకు ఈ ఘటన ప్రత్యక్ష్య నిదర్శనమన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల ద్వారా పర్వతరెడ్డి ఎంతో మంది విద్యార్ధులకు ఉచిత విద్య అందిస్తున్నారని సేవ చేస్తున్న వారిపై ఇటువంటి దాడుల దారుణమన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతు ఇటువంటి దాడుదలకు తాము బయపడబోమని, రానున్న రోజుల్లో కూటమి అవకతవలకు మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెలతామన్నారు. కూటమి ప్రభుత్వం ఇలానే పతిపక్షాల గోంతు నొక్కే కార్యక్రమం చేస్తే రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతామన్నారు. తమకు మద్దతుగా నెల్లూరు విచ్చేసి వారి సంఘీభావంత తెలిపిన అందరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, నాయకులు, ఆనం విజయ్‌కుమారెడ్డి, పూజితారెడ్డిలతోపాటూ రాష్ట్ర నలుమూలల నుండి వైపాకా నాయకులు, కార్యకర్తలు వచ్చి పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సీపీ వీధి నాటకాలను జనం నమ్మరు

- మంత్రి నారాయణ

- నోటీసులొస్తే రోడ్డెక్కడం సిగ్గుచేటు
- తప్పు ఎక్కడ జరిగినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది




**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – కలెక్టరేట్** నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు నోటీసులు ఇస్తే వైఎస్ఆర్సీపీ నేతలు రోడ్డెక్కి వీధి నాటకాలు వేయడం సిగ్గుచేటని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం చేసే డ్రామాలను జనం నమ్మరన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న మంత్రి వైఎస్ఆర్సీపీ ఆందోళనపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. నెల్లూరులో ఎంఎల్సీ చంద్రశేఖర్ రెడ్డి కాలేజీకి నోటీసులు ఇవ్వడంపై జరుగుతున్న రాద్ధాంతంపై మంత్రి హాట్ కామెంట్స్ చేశారు. అసలు ఆ నోటీసుల వ్యవహారం తనకు తెలియనే తెలియదని, మొన్న భీమవరంలో నారాయణ విద్యాసంస్థలకు కూడా అధికారులు నోటీసులు ఇచ్చారని, ఆ విషయాన్ని తన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు ఫోన్ చేసి చెబితేనే తనకు తెలిసిందని వెల్లడించారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసుకోవాలి తప్ప రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కక్షగట్టి నారాయణ గ్రూప్స్‌ను రకరకాలుగా వేధించారన్నారు. అప్పటి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి నేరుగా వచ్చి ఆందోళన చేసినా తాము ఓపిక పట్టి అధికారుల క్లియరెన్స్ తెచ్చుకున్నామే తప్ప రాజకీయం చేయలేదని గుర్తు చేశారు. మీలా లబ్ధి పొందాలనుకుంటే అప్పట్లో రోజుకో ఆందోళన చేసేవాళ్లమన్నారు. కూటమి ప్రభుత్వం వ్యాపారస్తులను, విద్యాసంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టదని, ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించదని, తప్పు ఎక్కడ జరిగినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

# వైభవంగా బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారం

- దర్గా అభివృద్ధికి 5 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు
- వైసీపీ హయాంలో దర్గా పై నిర్లక్ష్యం
- కూటమి పాలనలో మళ్లీ మంచి రోజులు మంత్రి నారాయణ
- రొట్టెల పండుగకు 14 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం
- పారిశుధ్యానికి పెద్దపీట
- 30 ఏళ్లుగా నేను బారాషహీద్ దర్గా భక్తుడిని
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – వైద్యం** నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా బారాషహీద్‌ల సమాధులను దర్శించిన మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దర్గా కోసం ఐదు కోట్ల రూపాయలు కేటాయించారని మంత్రి నారాయణ తెలిపారు. గతంలో 2014లో నారాయణ మంత్రిగా ఉన్నప్పుడే స్వర్ణాల చెరువు ఘాట్లు, మరుగుదొడ్లు, రూ.20 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ వంటి పనులకు పునాది పడిందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గుర్తుచేశారు. దర్గాకు తాను 30 ఏళ్లుగా భక్తుడినని, గత ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధి కోసం పోరాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. తన హయాంలో ఈద్గా, ముఖద్వారాలు నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాబోయే రొట్టెల పండుగలో భక్తుల సంఖ్య 14 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉన్నందున, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులంతా సమన్వయంతో అద్భుతమైన ఏర్పాట్లు చేయాలని, దర్గా సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని నేతలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు ప్రక్రియపై మంత్రి నారాయణ సమీక్ష

- వచ్చేనెల 14లోగా ఓటర్ల జాబితా సవరణలు పూర్తి చేయాలని ఆదేశం
- బిఎల్‌ఓలు పొలిటికల్ పార్టీల బిఎల్ఏలు సమన్వయంతోనే ఓటర్ల జాబితా నవీకరణ



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 22 ప్రభాతవార్త :** నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బిఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 15నుంచి వచ్చేనెల 14వరకు ఓటర్ల జాబితా నమోదు, సవరణలు ప్రక్రియ ముమ్మరంగా సాగాలని ఆదేశించారు. ఫామ్-6, 7,8చే ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పేర్లుసవరణలు, ఎలాంటి లోపాలు లేకుండా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల బిఎల్‌ఏలతో సమన్వయం చేసుకుంటూ ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, వచ్చేనెల 14లోపు ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని డెడ్‌లైన్ విధించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అదనపు కమిషనర్ హిమబిందు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో మంత్రి నారాయణ

- సమస్యల పరిష్కారంలో సరికొత్త రికార్డు
- నెల్లూరు జిల్లా గ్రీవెన్స్ డేటా వివరాలపై ఆరా తీసిన మంత్రి
- రెవెన్యూ సమస్యలపైనే ఫోకస్



**నెల్లూరు, జూన్ 22, ప్రభతవార్త – కలెక్టరేట్** నెల్లూరు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం క్రమం తప్పకుండా సాగుతోంది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొని స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లావ్యాప్తంగా మొత్తం 82,166 గ్రీవెన్స్ దరఖాస్తులు రాగా, అధికారులు రికార్డు స్థాయిలో 87 శాతం అంటే 71,549 అర్జీలను విజయవంతంగా పరిష్కరించారని వెల్లడించారు. పరిష్కారమైన వాటిలో కేవలం 5,384 మంది మాత్రమే సంతృప్తి చెందక మళ్లీ దరఖాస్తు చేసుకున్నారని, మొత్తం అర్జీలలో సింహభాగం 57 శాతం ఒక్క రెవెన్యూ శాఖ నుంచే వస్తున్నాయని ఆయన తెలిపారు. రెవెన్యూ విభాగంలోనూ 84 శాతం సమస్యలను ఇప్పటికే పరిష్కరించారని చెప్పారు. ఎక్కువగా కుటుంబాల ఆస్తి తగాదాలు, పొలాల సరిహద్దు వివాదాలే వస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## తహశీల్దార్‌ను కలిసిన జన సైనికులు



**అల్లూరు, జూన్ 22 ప్రభాతవార్త :** అల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతనంగా బాధయతలు చేపట్టిన తహశీల్దార్ నవీన్‌కుమార్‌ను మండల జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసైనికులను తహశీల్దార్ పేరుపేరునా ఆప్యాయంగా పకలరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు కార్తీక్‌శర్మ, కుత్తుల విజయకుమార్, నీలపురెడ్డి దీక్షిత, చేవూరు సుబ్రమణ్యం, చిన్నంగారి వెంకటరమణ, పేట రాఘవయ్య, బండి జశ్వంత్‌రెడ్డి, బెజవాడ రవికుమార్, రాము, ముంతా నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

## సుబ్బారామమ్మ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి..

**- ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ**



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రతిష్ఠాత్మకమైన పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా మంత్రి జిల్లా కలెక్టర్,జిల్లా అధికారుల సమక్షంలో అసత్యపు ఆరోపణలతో రెవెన్యూ శాఖను కించపరిచిన సుబ్బారామమ్మపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, అన్ని శాఖల జిల్లా అధికారుల సమక్షంలో అసత్యపు ఆరోపణలతో రెవెన్యూ శాఖను కించపరిచిన సుబ్బారావమ్మ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా నెల్లూరు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల పక్షాన కలెక్టర్‌ని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ తరపున కోరారు. గతంలో కూడా పలు పర్యాయాలు వీరు వీరి కుటుంబ సభ్యులు న్యాయవాది వృత్తిలో ఉన్నారని చెప్పుకుంటూ రెవెన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరుని, నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారిని కించపరిచిన సంఘటనలు జరిగి ఉన్నాయి. రెవెన్యూ శాఖను కించపరుస్తూ, దూషిస్తూ, అవమాన పరుస్తూ రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగుల మనోభావాలను పదే, పదే దెబ్బతీస్తున్న వీరిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ వారిని కోరారు. అందరూ జిల్లా అధికారుల సమక్షంలో, జిల్లా అధికారుల అందరి సాక్షిగా జరిగిన ఈ ఘటనపై కలెక్టర్ వెంటనే విచారణ జరిపించి, జిల్లా అధికారుల సంఘం ద్వారా పోలీస్ కేసు నమోదు చేయించి, రెవెన్యూ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంచవలసిందిగా అభ్యర్థించారు. ఘనమైన చరిత్ర కలిగిన రెవెన్యూ శాఖ ప్రతిష్టను కాపాడవలసిందిగా జిల్లాలోని రెవిన్యూ ఉద్యోగుల పక్షాన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ తరుపున కలెక్టర్‌ని కోరినట్లు రెవెన్యూ అసోసియేషన్ జిల్లా నాయకులు తెలిపారు. వీళ్ళ అమ్మ కుటుంబ సభ్యులు అమ్మేసిన భూమిపై తమకు హక్కు ఉందని అసత్య ప్రచారాలు చేస్తూ, వాళ్లపై దౌర్జన్యంగా దాడులు చేస్తూ దుష్ప్రచారం చేస్తూ తిరుగుతుందని వీళ్ళ అమ్మ చనిపోయిన తర్వాత ఆ స్థలాలను ఈమె దక్కించుకోవాలని రెవెన్యూ కార్యాలయాల్లో చుట్టూ తిరుగుతు ఈమపై రెవెన్యూ శాఖ చట్టపరమైన చర్యలు ఏమైనా తీసుకుంటే వాళ్లపై దృశ్యప్రచారాలు చేస్తూ కించపరుస్తూ, జిల్లా కోర్టులో కూడా ఈమెపై బహిష్కరణ వేటు ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## పి4 స్ఫూర్తితో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు వృత్తిరిత్యా నెల్లూరులో నివాసం ఉంటున్న పోలీసు ఉద్యోగులు మోహన్, పరమేశ్వరి కుమారుడు, కోడలు ఎంవి.అఖిల్, అలేఖ్య దంపతులు తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థలో చదువుకొంటున్న ఇద్దరు విద్యార్థులకు సోమవారం సైకిళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా 18వవార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ శానంహరి మాట్లాడుతూ సేవాసంస్థలో చదువుకొంటున్న విద్యార్థులకు కళాశాలలకు వెళ్ళి చదువుకోవడం కోసం అవసరమైన రెండు సైకిళ్లను పి4 స్ఫూర్తితో అందజేసిన దాతలకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర, టీచర్ ఆస్మా, విద్యార్థులు, రాజ్యలక్ష్మి, ప్రసన్నలు పాల్గొన్నారు.

## దుత్తలూరు బిసి కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్



**దుత్తలూరు జూన్ 21 ప్రభాతవార్త** మండల కేంద్రమైన దుత్తలూరు బిసి కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ ఉదయగిరి సిఐ వెంకట్రావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 36 బైకులు,మూడు ఆటోలు విచారణ కొరకు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్ళాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అపరిచత వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్, గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారులను వేదిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో పలు మండలాలల ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యవారిపల్లెలో పక్కాగృహాలపై గ్రామసభ



**సీతారామపురం జూన్ 22 ప్రభాతవార్త** పేదలకు పక్కాగృహాలు అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాసయోజన పథకంపై సోమవారం అయ్యావారిపల్లిలోని పంచాయితీ ప్రత్యేకాధికారి ఎంపిడిఒ జి,చిన్నచెన్నారావు సమక్షంలో హౌసింగ్ ఏఇ వెంకటేష్ కార్యదర్శి మాల్యాద్రి గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు పథకం అర్హతలు లబ్దిదారుల ఎంపిక విధానం, ధరఖాస్తు ప్రక్రియ , గృహనిర్మాణానికి అందించే పథకం గురించి గ్రామస్తులకు వివరించారు అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 57 మంది లబ్దిదారులు ధరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.ఈకార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇనస్పెక్టర్ చెన్నరాయుడు, స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి ఇంటర్వ్యూలు వాయిదా



**వింజమూరు, జూన్ 22, ప్రభాతవార్త** వింజమూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీలు ఏర్పడ్డ అంగన్వాడి కేంద్ర కార్యకర్తలు సహాయకుల ఇంటర్వ్యూలు వాయిదా పడినట్లు సిడిపిఓ పద్మజ కుమారి తెలిపారు. కావలి డివిజన్ పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల నియామక ఇంటర్వ్యూలను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడడంతో తదుపరి తేదీని తెలియజేయునట్లు ఆమె తెలిపారు. అందువల్ల అభ్యర్థులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా సిడిపిఓ విజ్ఞప్తి చేశారు.

## ఏకీకృత సర్వేపై అభ్యందతరాలు ఉంటే24లోగా తెలియజేయండి.

**కలిగిరి,జూన్22, ప్రభాతవార్త;** కలిగిరి మండంలోని 14 స్వర్ణగ్రామాలలో నిర్వహించిన ఏకీకృత కుటుంబ సర్వే కార్యక్రమంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 24లోగా ఆయా గ్రామ కార్యాలయాల్లో తగిన ఆదారాలతో పిర్యాదు చేయవచ్చని కలిగిరిమండల యంపిడిఓ ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు.14 స్వర్ణ గ్రామాలకు సంభందించిన ఏకీకృత కుటుంభ సర్వేఆయా గ్రామ పంచాయితీలలో ప్రకటించడంజరిగిందన్నారు.ప్రచురించిన వివరాలలో సామాజిక ఆర్ధిక వివరాలు,విద్య, నైపుణ్యం వివరాలు ఉపాది మరియు ఆదాయ వనరుల వివరాలు,కుటుంభస్థాయీ వివరాలు పొందుపరచబడ్డాయన్నారు.మండలంలోని అన్నిగ్రామాల ప్రజలందరూ తమ కుటుంబాలకు సంభందించిన అన్నివివరాలనూ గ్రామ కార్యాలయాల్లో ప్రచురించడం జరిగిందని ఈ వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించి ప్రచురించిన సమాచారం సరిగ్గా ఉందోలేదో దృవీకరించోవాలన్నారు.ఏవైనా తప్పులు, మార్పులు సవరణలు ఉన్నచోసంభందిత ఆదారాలతో 24లోపు గ్రామ పంచాయితీ అభివృద్ధి అదికారికి అందజేయాలని యంపిడిఓ తెలిపారు.

## అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

**కలిగిరి,జూన్22, ప్రభాతవార్త;** కావలి డివిజనల్ పరిదిలోని వింజమూరు ఐసిడియస్ ప్రాజెక్టు పరిదిలో ఈనెల23న జరగవలసిన అంగన్వాడీలఇంటర్వ్యూలు కొన్ని అనివార్యకారణాల వల్ల ఆగినాయనిఐసిడియస్ వింజమూరు ప్రాజెక్టుఅదికారిణి సిహెచ్. పద్మజా కుమారి ఓ ప్రకటనలో తెలిపారు.వింజమూరు ప్రాజెక్టు పరిదిలోని కలిగిరి, వింజమూరు, జలదంకి, మండలాల్లో కాళీగా ఉన్న 2కార్యకర్తల పోష్టులకు,4మినీ అంగన్వఆడీ కార్యకర్తలపోష్టులకు,29 అంగన్వఆడీ హెల్పర్ల పోష్టులకు 23న డివిజనల్ కార్యాలయమైన కావలిలో ఇంటర్వ్యూలు జరగాల్సి ఉందన్నారు.అనివార్య కారణాలవలనఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయని మరలా ఎప్పుడూ జరిగేది తెలియ పరుస్తామని సిడిపిఓ తెలిపారు.

## యానాది గిరిజన కుటుంబాల పరిస్థితులపై సమగ్ర సర్వే చేపట్టాలి..

**- నెల్లూరు జిల్లా కలెక్టర్ శుక్ల**



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – కలెక్టరేట్** అధ్యక్షతన జిల్లా స్థాయి బాండెడ్ లేబర్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మరియు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్‌డీవోలు), ఉప కార్మిక కమిషనర్, ఫ్యాక్టరీల శాఖ అధికారులు, విద్యాశాఖ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, సాంఘిక సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసు అధికారులు, పీడీడ్వామా, పీడీడీఆర్‌డీఏ, పీఓఐటీడీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా శిశు పరిరక్షణ అధికారి (డీసీపీఓ), బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్మన్ మరియు ప్రభుత్వేతర సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యానాది గిరిజన సమాజానికి చెందిన కుటుంబాలు సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన కారణంగా బాల కార్మికత్వం, వెట్టిచాకిరీ (బాండెడ్ లేబర్) బారిన పడే అవకాశం అధికంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) సంయుక్తంగా యానాది గిరిజన కుటుంబాల సామాజికఆర్థిక పరిస్థితులపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఇటుక బట్టీల వద్ద బాల కార్మికులు, బాండెడ్ లేబర్ ఎక్కువగా పనిచేసే అవకాశాలు ఉన్నందున, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సర్వే నిర్వహించాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలోని ఇటుక బట్టీ యజమానుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి, బాల కార్మికులు మరియు వెట్టిచాకిరీ కార్మికులను నియమించరాదని అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాల కార్మికులు లేదా బాండెడ్ లేబర్‌ను నియమిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని, శిక్షార్హమైన నేరమని యజమానులకు వివరించాలని సూచించారు. జిల్లాలో బాల కార్మిక నిర్మూలన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి, అత్యవసర సహాయ సేవల టోల్ ఫ్రీ నంబర్ 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్)ను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరీ లేదా బాలలపై ఏవైనా దుర్వినియోగ ఘటనలు గమనించిన వెంటనే ప్రజలు 1098కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బాల కార్మికత్వం, వెట్టిచాకిరీ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, బాధిత కుటుంబాల పునరావాసం, విద్య, జీవనోపాధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధులపై దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎండలబారిన పండకుంగా ఉండాలని ఏరియా ఆసుపత్రి ఆయుష్‌వైద్యులు డాక్టర్ హోలీ మౌళి తెలిపారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యలో ప్రజా విజ్ఞప్తులు కార్యక్రమం జరిగే పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో వైద్యులు డాక్టర్ మాలీమౌలాలి, సర్దాయిపాలెం వైద్యులు రాజా నరసింహులు పాల్గొని పట్టణ ప్రజలకు, ఎండలు తీవ్రంగా ఉన్నందున పాటించాల్సిన జాగ్రత్తలు, ఎండబారిన పడకుండా ఏ విదంగా కాపాడుకోవాలి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడి జరిగింది. ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. సిబ్బంది దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## కారు,మోటార్‌బైకు ఢీ వ్యక్తికి గాయాలు



**దుత్తలూరు జూన్ 22 ప్రభాతవార్త** మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బి అతిధి గృహం మలువు వద్దకారు,మోటార్ బైకు ఢీకున్న సంఘటన సోమవారం జరిగింది. వివరాల మేరకు సంగం గ్రామానికి చెందిన బషీర్ మోటార్‌బైకుపై ఉదయగిరి పట్టణంలోని తమ బంధువుల ఇంటికొచ్చి తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళుతున్నాడు. నందిపాడు గ్రామంలో ఇద్దరు పాఠశాల విద్యార్థులను ఎక్కించుకొని వెళుతున్నాడు. నందిపాడు సెంటర్ నుండి ఉదయగిరివైపు కారు వస్తుంది. ఈక్రమంలో నందిపాడు వద్ద మలుపు వద్దకు రాగనే ప్రమాదవశాత్తు కారు ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో బషీర్ కాలు విరగ్గా,శరీరంపై గాయాలైయ్యాయి. విద్యార్దులకు ఏలాంటి గాయాలు కాలేదు. గమనించిన స్దానికులు 108 వాహనానికి సమాచం అందించడంతో అతన్ని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

## ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి 27న ఇంటర్వ్యూలు



**ఇందుకూరుపేట, జూన్ 22, ప్రభాతవార్త** ఇందుకూరుపేట ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ పరిధిలోని వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ సీడీపీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల పరిధి నుంచి ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత అర్హులైన అభ్యర్థులందరికీ నెల్లూరు డివిజన్ పరిధిలోని ఆర్.డి.ఓ కార్యాలయంలో ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ స్పష్టం చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం నుండి ఇప్పటికే కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, ఇతర అన్ని రకాల ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఈ సందర్భంగా సీడీపీఓ సూచించారు.

## రేపు అంగన్వాడీ ఇంటర్యులు

**ఆత్మకూరు, జూన్ 22 ప్రభాతవార్త :** ఆత్మకూరు ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ ఖాళీలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 24 వతేదీ ఇంటర్వ్యూలు జరుగుతాయని ఐ సి డి ఎస్ సిడిపివో పి. సునీలత పేర్కొన్నారు. మే నెల 7 వ తేదీన విడుదల చేసిన నోటిఫికేషన్ కి సంబంధించి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను జూన్ 24వ తేదీన ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం నందు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.కనుక ఆస్మకూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఆత్మకూరు, ఏ ఎస్ పేట, సంగం, చేజర్ల మండలాలకు చెందిన ఆయా కేటగిరీలకు అప్లై చేసిన అభ్యర్థులందరూ కాల్ లెటర్లు, మరియు ఒరిజినల్ సర్టిఫికెట్లు అన్నీ తీసుకొని 24 వ తేదీన ఉదయం 9 గంటలకు ఆర్డీవో కార్యాలయములో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా సునీలత తెలియజేశారు

## ప్రకృతి సాగుకు విత్తన గుళికలతో ఊతం



**విడవలూరు, జూన్ 22 ప్రభాతవార్త:** అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పార్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. డీపీఎంయూ అధికారి ప్రసాద్ పర్యవేక్షణలో పీఎండీఎస్ విత్తనాలను గుళికలుగా తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. అనంతరం ముందుగా దున్నిన పొలంలో ఆ విత్తన గుళికలను చల్లారు.రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. విత్తనాలను గుళికలుగా తయారు చేయడం ద్వారా మొలక శాతం పెరగడంతో పాటు, మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులు లాభదాయకమైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏ శ్వేత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి. కవితారాణి, ఐసీఆర్‌పీఎస్ మోనిక, విజయలక్ష్మి, రాకేష్, సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు

## ఫోటగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** కావలి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు కావ్య స్టూడియో నిర్వాహకుడు బొడ్డు కార్తీక్ ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా కావలి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.52వేలు కార్తీక్ కుటుంబానికి సాయం అందించారు. అసోసియేషన్ సభ్యులందరికి అధ్యక్షుడు ఎస్ఆర్.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శి చిలకపాటి మదు, ఉపాధ్యక్షుడు హనుక్‌పాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలు చేయదు

**- అజాత శత్రువు మంత్రి నారాయణపై విమర్శలు తగవని హితవు**
**- 18 మంది వైసీపీ ఎమ్మెల్సీల వింత నాటకం సరదా సన్నివేశం**
**- విద్యాలయాల్లో తనిఖీలు సాధారణం**
**- రాజకీయ రంగు పూయొద్దని చురకలు**
**- నెల్లూరు రాజకీయాలు మరోసారి వేడెక్కాయి**
**- రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర విమర్శలు**



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త – వైద్యం** నగరంలో వైసీపీ నేతలు నిర్వహిస్తున్న ఆందోళనలపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు వీధుల్లో చేస్తున్న ప్రెస్ మీట్లు ఒక పెద్ద కామెడీ డ్రామా అని కొట్టిపారేశారు. మంత్రి పొంగూరు నారాయణపై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. మంత్రి పొంగూరు నారాయణ లక్ష్యంగా నెల్లూరులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు 18 మంది ఎమ్మెల్సీలు చేసిన ఆందోళనలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు.అదో సరదా సన్నివేశమని ఎద్దేవా చేశారు.విద్యాసంస్థల పునఃప్రారంభ సమయంలో అధికారులు నిర్వహించే తనిఖీలు కేవలం సాధారణ ప్రక్రియ మాత్రమేనని, దీనికి రాజకీయ రంగు పూయడం తగదని హితవు పలికారు. ఒకవేళ ఇది కక్షసాధింపు చర్యే అయితే, భీమవరంలో ఉన్న మంత్రి నారాయణ స్వంత విద్యాసంస్థల్లో కూడా అధికారులు ఎందుకు తనిఖీలు చేస్తారని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు చట్టానికి భయపడాల్సిన అవసరం లేదని, లోపాలు ఉంటే సరిచేసుకోవాలే తప్ప ఇలా రోడ్లపై నాటకాలు ఆడటం సరికాదన్నారు. ప్రజాదరణ ఉన్న మంత్రి నారాయణను ఎన్నికల్లో ఎదుర్కొనే సత్తా లేక తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి వీధి నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నడూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడదని నొక్కి చెప్పారు. తాను గతంలో వైసీపీలో మూడున్నర సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు విద్యాసంస్థల సమస్యలను అధికారులతో కలిసి సామరస్యంగా, గౌరవప్రదంగా పరిష్కరించుకున్నామే తప్ప ఎప్పుడూ ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయలేదని గుర్తుచేసారు. వైసీపీ నేతల ప్రెస్ మీట్ కేవలం ఎన్నికల లబ్ధి కోసం ఆడిన ఒక వింత నాటకమని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తేల్చిచెప్పారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు,సహాయకుల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు : సిడిపిఓ సునంధ



**రాపూరు,జూన్22ప్రభాతవార్త** రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా వున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మీని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తి నిమిత్తం ఈ నెల 27వ తేది ఉదయం 10 గంటలకు నెల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యలయంలో, ఈ నెల 24వ తేది ఉదయం 10 గంటలకు ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రాపూరు ఐసిడిఎస్ సిడిపిఓ సునంధ తెలిపారు.ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు. రాపూరు మండలం, సైదాపురం మండలాలకు సంబందించి అంగన్‌వాడీ కార్యకర్తలు, మీని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుకు ధరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 27 వ తేది నెల్లూరు ఆర్డీఓ కార్యలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. కలువాయి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మీని అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకుల పోస్టుకు ధరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 24వ తేది ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి వుందన్నారు.

## పల్స్ పోలియో కార్యాచరణపై శిక్షణ



**తోటపల్లి గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త:** మండలంలోని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారిణి డాక్టర్ హేనా ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. పోలియో మైలైటిస్ వైరస్ వల్ల వచ్చే పోలియో వ్యాధిని నివారించాలంటే ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అలాగే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో మొదటి రోజు గుర్తించిన కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, రెండవ, మూడవ రోజుల్లో ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అలాగే గృహాలపై మార్కింగ్ చేసే విధానం గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ శాంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమేష్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉమర్, పర్యవేక్షకులు సతీష్, రాజు, బెంజిమెన్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం.. మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం



**విడవలూరు,జూన్ 22ప్రభాతవార్త:** రైతులకు ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్.ఎస్. లక్ష్మి పాల్గొని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఆహార ప్రాసెసింగ్, పీఎండీఎస్ కిట్ల వినియోగంపై వివరించారు. అలాగే ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు భూమి విస్తీర్ణం ఆధారంగా ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, వీఏఏ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తకాలు పంపిణీ



**ఉదయగిరి, జూన్ 22, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఆల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా ఇంటర్మీడియట్ విద్య అభ్యసి స్తున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం కళాశాల ప్రిన్సి పాల్ ఉసర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఆశయంతో నూతన ఉత్తేజంతో చదువుల్లో భాగా రాణించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యాభ్యాసం కొనసాగాలని విద్యార్థులకు తెలియ జేశారు. కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు వాయిదా

**ఉదయగిరి, జూన్ 22, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వరికుంటపాడు, దుత్తలూరు మండలాల అంగన్‌వాడీ ఆయా పోస్టులతో పాటు దుత్తలూరు మండలంలోని ఒక అంగన్‌శాడీ కార్యకర్త, నాలుగు హెల్పర్ల పోస్టులకు అలాగే వర్క్ మండలంలోని కృష్ణ గాంధీపురం అంగన్‌వాడీ ఆయా పో స్టులతో పాటు మంగళ వారం కావలి ఆర్డీవో కార్యాలయంలో జరగాల్సిన ఇంటర్వ్యూలకు కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు సీడీపీవో పుణ్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తారనేది పత్రికా ముఖంగా తెలియజేస్తామని సీడీపీవో పుణ్యవతి తెలిపారు.

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, Shaik Vaseem S/o Shaik Sulthan Mohiddin Resident at 2/515, Nazeer thota, Nawab pet, Nellore Dist A.P-524002, inform that my Wife name as been changed from Shaik Bareera Banu (Old Name) Shaik Barera Banu (New Name) affidavit dt 20/06/2026
(Ro.No.11666)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



**సైదాపురం, జూన్ 22, ప్రభాతవార్త** మండలంలోని చాగణం,సైదాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది సమా చారం మేరకు.. లింగసముద్రం గ్రామానికి చెందిన దాసరి వేమయ్య తన పాపను, మరి కొంత మంది దక్కిలి మండలంలో ఉన్నగురుకుల పాఠశాలకు ఆటోలో వెళ్తుండగాచాగణం గ్రామ సమీపంలో ఉన్న కళ్యాణ మండపం వద్ద బైక్‌ను తప్పించ బోయి అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థి శివకళ, దేవి అనే మహిళకు గాయాలవ్వడంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిర్వహిస్తూ గూడూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లింగసముద్రం గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తి బైక్‌లో సైదాపురం నుంచి లింగసముద్రం గ్రామానికి వెళ్తుండగా సైదాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో గాయాలవడంతో 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి అరవింద్‌ను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి 108 సిబ్బంది తరలించారు. 108 సిబ్బంది ఈఎంటీ బాబురావు, బీవీ రమణయ్యలు ఉన్నారు.

## 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలకు రుణాలు



**కలిగిరి,జూన్22, ప్రభాతవార్త** ;పండ్లతోటలు వేసుకునే రైతు సోదరులకు 100శాతం సబ్సిడీతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనుందని యన్నార్ఇజియస్ ఎపిడి మృదుల తెలిపారు. సోమవారం కలిగిరి మండలంలో ఎపిడి పర్యటించారు. ఈసందర్భంగా మండలంలో జరుగుతున్న ఉపాదిపనులను ఆమె ఎపిఓ తోకలసి పర్యవేక్షించా రు.అనంతరం ఎపిడి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం రైతలను ప్రోత్సహించే ఉద్దేశంతో రైతులకు ఆరుతడి పంటలను వేసుకోమని సలహాలు ఇస్తుందన్నారు. ఈక్రమంలో ఉద్యానపంటలైన పండ్ల తోటలు పెంచుకొనే రైతులు ముందుకు వస్తే వారికి 100శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వనుందన్నారు. అంతేగాక చెత్తనుండి సంపద కేంద్రాల పరిసరాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపిడి తెలిపారు. ఈకార్యక్రమంలో యంపిడిఓ ప్రత్యూష, ఎపిఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**విడవలూరు, జూన్ 15 ప్రభాతవార్త:** సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఏ.లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్ర మంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి అనుసరించాల్సిన విధానాలను జిల్లా అధికారులు వివరించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మండలానికి సంబంధించిన రెండు అర్జీలపై ప్రత్యేకంగా చర్చించారు. వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించగా, సంబంధిత అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత,ఎంపీడీవో నగేష్ కుమారి, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీలక్ష్మి, సూపర్వైజర్ సురేఖ, ఏపీఎం వెంకమ్మ, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ సాయి తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి రెండు లారీలు బోల్తా



**చిల్లకూరు, జూన్ 22, ప్రభాతవార్త** మండలంలోని వరగలి క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో అదుపుతప్పి మినీ లారీ బోల్తా పడింది. అదేవిధంగా నాయుడుపేటనుండి కృష్ణపట్నం పోర్టుకి వెళుతున్న వారి భారీ వాహనం అదుపు తప్పి జామాయిల్ తోటలోకి దూసుకు వెళ్లడం జరిగింది. ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉండడం ఈ రెండు ప్రమాదాలలో లారీ డ్రైవర్ కి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డుకి అడ్డంగా మినీ లారీ పడిపోవడంతో ట్రాఫిక్ జామ్ అవడంతో విషయం తెలుసుకున్న చిల్లకూరు పోలీసులు క్రేన్ సహాయంతో ట్రాఫిక్‌ను అంతరాయం లేకుండా తొలగించారు.

## వీడని చిక్కులు.. అందని రూకలు

### - అర్హత ఉన్నా సుఖీభవ లబ్ధికి దూరం

**కోట, జూన్ 22 ప్రభాతవార్త** అన్ని అర్హతలు ఉన్నా కోట మండలంలో చాలామంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కావడం లేదు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఇకేవైసి, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం వంటి సాంకేతిక చిక్కులతో సుఖీభవ సొమ్ము రావడం లేదు. కేంద్రం కొత్త వారికి అవకాశం ఇవ్వకపోవడంతో పిఎం కిసాన్ లబ్ధి దరిచేరడం లేదు. మండల పరిధిలోని ఉచ్చువారిపాళెంకు చెందిన సుబ్రహ్మణ్యం, రుద్రవరానికి చెందిన ఎస్‌కె మహబూబ్‌బాషాకు పిఎం కిసాన్ నగదు జమ కాలేదు. దీంతో సోమవారం స్థానిక వ్యవసాయాధికారిని కలిశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇంకా లింకేజి కూడా తమకు ఇవ్వలేదని, రెండు మూడురోజుల్లోగా అందరికీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని అధికారులు చెప్పుకొచ్చారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే కౌలు రైతులకు కూడా ఈ పథకం లబ్ధి రాకపోవడంతో పెదవివిరుస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 4 అర్జీలు



**కొడవలూరు, జూన్ 22 ప్రభాతవార్త :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 4 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో భూ విస్తరణ, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన తప్పిదాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే వీఆర్వోలు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఏటీఎం కృష్ణవేణి, మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కోటేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయాలి : తహశీల్దార్



**కొడవలూరు, జూన్ 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సమానంగా అందేలా చూడాలని కొడవ లూరు తహసీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు తగిన పరిష్కారం చూపాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలాచూడటం అధికారుల బాధ్యత అని, ఈవిషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే సమస్యల పరిష్కారం వేగవంతమై, ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని పేర్కొన్నారు. మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వార్తకు స్పందన: దంపూరులో అధికారుల మెరుపు తనిఖీ



**విడవలూరు, జూన్ 22 ప్రభాతవార్త:** అంధకారంలో దం పూరు.. వెలుగు కోసం గ్రామస్తుల నిరీక్షణ అనే శీర్షికతో ప్రభా తవార్తలో ప్రచురితమైన కథనానికి మండల యంత్రాంగం వెం టనే స్పందించింది. ప్రజా సమస్యలను గుర్తించిన పంచాయతీ ప్రత్యేక అధికారి, తహశీల్దార్ ఏ.లక్ష్మీ ప్రసన్న సోమవారం గ్రా మంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో సిబ్బం ది గైర్హాజరుపై ఆగ్రహం ఉదయం 10:30 గంటల సమయం లో తహశీల్దార్ పంచాయతీ కార్యాలయానికి చేరుకోగా, కనీసం కింది స్థాయి సిబ్బంది కూడా విధుల్లో లేకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుండా విధులకు ఎగనామం పెట్టడంపై అక్కడున్న సచివాలయ సిబ్బందిని నిలదీశారు. అనంతరం కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వెలుగు దిశగా అడుగులు గ్రామంలోని వీధిదీపాల సమస్యతో పాటు, మురుగు కాల్వల అపరిశుభ్రతను తక్షణమే తొలగిం చాలని ఆమె ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ అబ్దుల్ సలాం, తదితరులు పాల్గొన్నారు. పత్రికలో కథనం వచ్చిన వెంటనే ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి పరిస్థితిని పర్యవేక్షించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సదరంకు హాజరయ్యే వారు నిర్దేశించిన పత్రాలతో రావాలి



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం పరీక్షకు వచ్చే రోగులు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 20 మందికి సదరం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సదరం పరీక్షకు హాజరయ్యే ప్రతి రోగి వారి దగ్గర ఉన్న పత్రాలతో పాటు హాస్పిటల్ రిపోర్ట్స్ ఉంటే వాటిని కూడా తప్పక తీసుకురావాలన్నారు.

## ఎస్పీకి వినతుల వెల్లువ : ఎస్పీ డా. అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైం, జూన్ 22, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి చట్టప్రకారం బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సిహెచ్. సౌజన్య, నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష, కావలి డీఎస్పీ వి.వి. రమణ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 162 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం వద్దని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చూడాలని సూచించారు. వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని స్పష్టం చేశారు. ఉద్యోగం ఇప్పిస్తామని, క్రిప్టో కరెన్సీలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ. 18 లక్షలు తీసుకుని బెదిరింపులకు పాల్పడ్డారని చిల్లకూరుకు చెందిన ఓ బాధితురాలు ఫిర్యాదు చేశారు. బుచ్చిరెడ్డిపాలెం కు చెందిన ఓ వివాహిత తనను అదనపు కట్నం కోసం శారీరక, మానసిక వేధింపులకు గురిచేసి భర్త, అతని కుటుంబ సభ్యులు ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని, కేసును రాజీ చేసుకోమని బెదిరిస్తున్నారని దగదర్తికి చెందిన మహిళ బాధను ఎస్పీకి వ్యక్తం చేశారు. మే 5వ తేది నుండి తన భర్త విజయ్ కనిపించడం లేదని, లోతుగా దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని చిల్లకూరుకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, పీసీఆర్ సీఐ భక్తవత్సల్ రెడ్డి, డీసీఆర్బీ సీఐ రామారావు, ఎస్బి 2 సీఐ శ్రీనివాసులు రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సొసైటీ బ్యాంకుకు వాటర్ కూలర్ విరాళం



**తోటపల్లి గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త** మండలంలోని తోటపల్లి గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ బ్యాంక్)కు ఈదూరు గ్రామానికి చెందిన దివంగత పెద్ద ఆనందయ్య, సుజాతమ్మల జ్ఞాపకార్థం వారి కుమా రులు పెద్ద సతీష్, సందీప్‌లు వాటర్ కూలర్‌ను విరాళంగా అందజేశారు. సొసైటీ బ్యాంకు ప్రాంగ ణంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ ఛైర్ పర్సన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ కూలర్‌ను బ్యాంకు వినియోగానికి అందుబాటులో ఉంచా రు. ఈ సందర్భంగా దాతల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ జానా శ్రీనివాసులు, సంఘ సీఈవో వరప్రసాద్, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతు లు, ఖాతాదారులకు ఈ వాటర్ కూలర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## గువ్వల గుండె చాటిన ఔదార్యం

### - బడి బాగుకోసం లక్షన్నర విరాళం



**వింజమూరు, జూన్ 22, ప్రభాతవార్త** తండ్రి చదివిన బడిపై తనయుడు చూపిన మమకారం అందరి హృదయాలను గెలుచుకుంది. వింజమూరు బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రముఖ వ్యాపారవేత సీనియర్ రాజకీయ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి తనయుడు గువ్వల హర్షవర్ధన్ రెడ్డి రూ. 1,50,000 భారీ విరాళం ప్రకటించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం పాఠశాలను సందర్శించిన హర్షవర్ధనరెడ్డి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. బెంచీలు సరిపడా లేక చాలా మంది ముఖ్యంగా బాలికలు నేలపై కూర్చుని పాఠాలు వినాల్సి వస్తోందని విద్యార్థులు ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, పాఠశాలలోని 120 బెంచీలకు పూర్తి స్థాయి మరమ్మతులు చేయించేందుకు అవసరమైన 1.50 లక్షలు వ్యయం చేస్తానని వేదికపైనే ప్రకటించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మా నాన్న, బాబాయి ఈ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ బడికి మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోతే చదువుకు ఆటంకం కలుగుతుంది. అందుకే ఈ చిరు సాయం. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి ఏం కావాలన్నా నేను ముందుంటాను అని హామీ ఇచ్చారు. హర్షవర్ధన్ రెడ్డి ప్రకటనతో పాఠశాల ప్రాంగణం హర్షధ్వానాలతో మారుమోగింది. హెచ్ఎం జి. వీరరాఘవులు మాట్లాడుతూ విద్యార్థులకు బెంచీల సమస్య వేధిస్తోంది. సరైన సమయంలో హర్షవర్ధన్ రెడ్డి ఆదుకోవడం మా పాఠశాలకు వరం. ఆయనకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు అని తెలిపారు. చదివిన బడిని మరిచిపోకుండా లక్షన్నర విరాళం ప్రకటించిన హర్షవర్ధన్ రెడ్డి దాతృత్వాన్ని ఉపాధ్యాయుల బృందం గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు వేనోళ్ల కొనియాడుతున్నారు.

## 24న ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నియామక ఇంటర్వ్యూలు



**చేజర్ల, జూన్ 22, ప్రభాతవార్త** ఐసీడీఎస్(సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం) ప్రాజెక్టు ఆత్మకూరు పరిధిలో వివిధ కేటగిరి పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 24న ఇంట ర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆత్మకూరు సీడీపీవో సునీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మే 7వ తేదీన విడుదల చేసిన నియామక నోటిఫికేషన్‌కు స్పందించి దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వ హించనున్నారు. సంబంధిత కేటగిరీలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ తప్పనిసరి హాజరు కావాలని అధికారులు సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ కాల్ లేటర్‌తో పాటు అన్ని ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రాలు, నివాస ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు, ఇతర అవసరమైన పత్రాలను వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు. ధృవీకరణ ప్రక్రియ అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలు జూన్ 24వ తేదీ ఉదయం 9గంటలకు ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రారంభమవుతాయని, అభ్యర్థులు సమయానికి ముందుగానే చేరుకొని నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలు లేకపోతే లేదా నిర్ణీత సమయానికి హాజరు కాకపోతే ఎంపిక ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అందువల్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆత్మకూరు పరిధిలోని ఆయా పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అవసరమైన అన్ని ఒరిజినల్ ధృవపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రైతులకు ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన

### - పొదలకూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్



**చేజర్ల, జూన్ 22, ప్రభాతవార్త** రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలనే లక్ష్యంతో చేజర్ల రైతు భరోసా కేంద్రంలో రెండు రోజుల పాటు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం పొదలకూరుకు చెందిన శాస్త్రవేత్తలు, పొదలకూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి శివ నాయక్, మండల వ్యవసాయశాఖ అధికారి హిమబిందు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పలు ఆధునిక వ్యవసాయ విధానాలు, ఎరువుల వినియోగం, సాంకేతిక సేవలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలోభాగంగా జీవన ఎరువుల(బయో ఫర్టిలైజర్స్) ప్రాముఖ్యత, వాటి వినియోగం ద్వారా నేల సారాన్ని పెంపొందించే విధానాలు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను శాస్త్రవేత్తలు వివ రించారు. అలాగే యూరియా ఎరువును అవసరమైన మోతాదులోనే వినియోగించాలని, అధిక వినియోగం వల్ల పంటలకు, నేల ఆరోగ్యానికి కలిగే నష్టాలను రైతులకు తెలియజేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎండీఎస్ కిట్ల వినియోగం, వాటి ద్వారా పంటల దిగుబడి పెంపు, ఖర్చుల తగ్గింపు వంటి అంశాలపై వివరించారు. రైతులు సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం, నమోదు ప్రక్రియ, సేవల వినియోగంపై రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు సందేహాలకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అనుసరించాల్సిన పంటల యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు. మండలంలోని పలు గ్రామాల రైతులు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అవలంభించడం ద్వారా ఉత్పాదకత పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## డిఆర్ఓ ని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా నేతలు



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ జిల్లా మ హిళా కన్వీనర్ ఎన్.జయశ్రీ, నెల్లూరు నగర అధ్య క్షురాలు సీహెచ్.నాగమణి,కార్యదర్శి ఎం.శైలజ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) విజయ్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలను న్యాయబద్ధంగా, వేగంగా పరిష్కరించాలని డీఆర్ఓను కోరారు. ఈ సందర్భంగా డీఆర్ఓ విజయ్ కుమార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మహిళా నేతలు తెలిపారు.

## డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలి

### - బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీరామ్



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** మెగా డీఎస్సీ 2025లో జరిగిన అవకతవకలపై వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా బహుజనసమాజ్ పార్టీచేపట్టిన ధర్నాకార్యక్ర మంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బి శ్రీరామ్ డిమాండ్ చేసినారు. ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకి ప్రసాద్ మాట్లాడుతూ హారిజెంటల్ రిజర్వేషన్ విధానంలో కొన్ని వర్గాల ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందని అలాగే స్పోర్ట్స్ కోటా పేరుతో డీఎస్సీ పరీక్ష వ్రాయని వారికి కూడా నియామక పత్రాలు ఇవ్వటం ఏంటి అన్నారు అలాగే డిస్టిక్ సెలక్షన్ కమిటీని కాదని అభ్యర్థులను అమరావతి పిలిపించుకోవడం అనుమానాలకు దారి తీస్తుందన్నారు. కాబట్టి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు.అలాగే జిల్లా బి. శ్రీరామ్ మాట్లాడుతూ ఇప్పటివరకు చంద్రబాబు నాయుడు నిర్వహించిన డీఎస్సీలో మెరిట్ లిస్ట్ ప్రకటించారు, కానీ 2025 –డీఎస్సీ మెరిట్ లిస్టును ప్రకటించలేదంటేనే అవకతవకలు జరిగే అని అర్థమవుతోంది అన్నారు. ప్రజలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సింది పోయి ప్రజల పైనే కేసులు పెడతామంటూ అధికారులు మాట్లాడటం సరికాదన్నారు. బీసీల పార్టీ టిడిపిపార్టీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు గారు బీసీలకు ఎన్ని నియామకాలు చేశారు ఓసీలకు ఎన్నినియమాకాలు చేశారో వాస్తవాలను బయట పెట్టాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెరిట్ లిస్టుతో పాటు క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను వెంటనే ప్రకటించా ల న్నారు. అలాగే అర్హత కలిగిన డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ బహుజన సమాజ్ పార్టీ డీఎస్సీ అభ్యర్థులకు అండగా నిలబడి రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ క్రాకుటూరు పుష్పాంజలి,రాష్ట్ర కార్యదర్శులు నాసిన భాస్కర్ గౌడ్, చోడవరం సుధాకర్, పార్లమెంట్ ఇన్చార్జులు కడింపాటి అశోక్, చిరమణ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ మెంబర్ దాసరి సుందరం, అలాగే అన్ని నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

## శక్తి టీం పోలీస్ సిబ్బందిచే అవగాహన



**బిట్రగుంట జూన్ 22 ప్రభాతవార్త** కావలి సబ్ డివిజన్ శక్తి టీం పోలీస్ సిబ్బంది బిట్రగుంటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం గర్ల్స్ హై స్కూల్ లో సోమవారం స్కూల్ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, శక్తిటీం ఇన్చార్జ్ ఎస్సై గోపీచంద్ బిట్రగుంట పిఎస్ ఏ.ఎస్.ఐ కోటేశ్వరరావు శక్తి టీం సిబ్బంది ఉమెన్ కానిస్టేబుల్స్ అనూష, సాయి కుమారి, శ్రీలక్ష్మీ ,కామేశ్వరి కానిస్టేబుల్ రమణ లు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత కోసం శక్తి అప్ ని,ఆపరేషన్ చిన్నారి తల్లి,ఆపరేషన్ దండయానాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరణ చేశారన్నారు. ప్రజల్లో మహిళల్లో పోలీస్ డిపార్ట్మెంట్ తరఫున అవగాహన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, కావలి సబ్ డివిజన్ డిఎస్పి వి.వి రమణ కుమార్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని, మహిళల చిన్నారుల భద్రత, చెడుస్పర్శ మంచి స్పర్శ,పోక్సో ఆక్ట్ యుటిజర్స్, డ్రగ్స్, గంజాయి,సోషల్ మీడియాలో జరిగే నేరాలు గురించి ఒక సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించుకోవాలో అవగాహనను చిన్నారులకు కల్పించారు. అంతే కాకుండా శక్తి యాప్ ని అందులో ఉండే ఫిచర్ ని అత్యవసర సమయములలో ఎలా ఉపయోగించుకోవాలో ఈ యొక్క పోగ్రామ్ ద్వారా అవగాహన కల్పించారు.

## 24న మండల సర్వసభ్య సమావేశం

**కోట, జూన్ 22 ప్రభాతవార్త** 24న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఓ ఆర్.దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షురాలు ఎంబేటి శశి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## లేగుంటపాడులో రైతన్నా మీ కోసం



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం లేగుంటపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి టి.రజని మా ట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వా రా ఎరువులను రైతులకు పంపిణీ చేసేలా చర్యలు చేపట్ట డం జరిగిందన్నారు. దీని కోసం ప్రతి రైతు వారి వారి పరిధిలో ఉన్న గ్రామ వ్యవసాయ సిబ్బంది దగ్గరకు వెళ్లి తమ భూమి వివరాలను పరిశీలన చేసుకుని ఈ యాప్ ద్వారా డీఏపీ యూరియాను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎలీనో ప్రభావం నుంచి మన భూమిని కాపాడుకునేలా రైతులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉన్న బీడు భూముల్లో పచ్చిరొట్ట ఎరువులు వేయాలని, ఈ కారణంగా భూమి అధిక ఉష్ణోగ్రత నుంచి కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. పెన్నా డెట్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీకర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

## యూనిఫైడ్ సర్వేలో తప్పుఒప్పులకు 24వరకు సరిచేసే అవకాశం



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని స్వర్ణ గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇటీవలయూనిఫైడ్ సర్వే కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలంటే యూనిఫైడ్ సర్వేలో వారి వివరాలు తప్పక నమోదు చేసి ఉండాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయం నోటీస్‌బోర్డులో ఈ సర్వేకు సంబంధించి ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా గ్రామాలకు సంబంధించి ప్రజలు ఈ నోటీస్ బోర్డులోని వివరాలు పరిశీలించి అందులో ఏమైనా తప్పులు ఉంటే ఈ నెల 24వ తేది లోగా సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రాథమిక దశ నుంచి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుపరిసరాల పరి శుభ్రతపై పూర్తిస్థాయిలో అవ గాహన చేసుకోవాలని కోవూరు సబ్ యూనిట్ అధికారి నాగరాజు తెలిపారు. కోవూరు లోని 3వ సచి వాలయం పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పిం చే కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో దోమల ద్వారా వచ్చేవ్యాధులపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన చేసు కోవాల న్నారు. ప్రధానంగా ఇంటి పరిస రాల్లో పాడైపోయిన టైర్లు, నీరు నిల్వ లేకుండా తగుచొరవతీసుకో వాలన్నారు.మానవహారం ఏర్పాటు చేసివి ద్యార్థులచేత ప్రతిజ్ఞ కార్యక్రమంనిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుబాబు,ఉపాధ్యాయులుసురేష్, వెంగల్ రావు, ఎంఎల్‌హెచ్‌పీ షాలిని, ఏఎన్ఎం సుమతి, ఎంపీహెచ్ఏ సురేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

## హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం




**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ళు గడుస్తున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని కాంగ్రె స్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామకోటయ్య ధ్వజ మెత్తారు. సోమవారం పట్టణంలోని స్థానిక జర్నలి స్టుక్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆత్మకూరు రామకోటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు అన్యాయాలపై ఇటీవల జరుగుతున్న డిఎస్‌సిలో అక్రమాలపై తమ పార్టీ అధ్యక్షులు దళాధిపతి విజయకుమార్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కూటమి నాయకులు తమ పార్టీ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అణచివేసే ప్రయ త్నాలు చేశారన్నారు. హామీలను నెరవేర్చడం చేతకాకపోయినా అధికారం బలంలో ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలను ఇవ్వడం జరిగిందని వాటిలో అనేక హామీలను తుంగలోతొక్కిందన్నారు. వాలంటీర్లకు నెలకు పదివేలు ఇస్తామనిచెప్పి, అధి.కారంలోకి వచ్చిన తరువాత వారి ఉద్యో గాలు తొలగించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో విజయకుమార్ నాయకత్వం ఎంతో అవసరమని 2029నాటికి కాంగ్రెస్‌పార్టీ ఒకశక్తివంతమైన పార్టీగా ఎదుగుతుంద న్నారు. గిరిజనసంఘ అధ్యక్షుడు చిలికల సుబ్రమణ్యం, పటటణ అధ్యక్షుడు కాటంగారి బాబు, బిట్2 అధ్యక్షుడు నాయుడు, నాగార్జున పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో గాలులతో కూడిన భారీ వర్షం

**కోట,జూన్ 22 ప్రభాతవార్త** సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడి భారీవర్షం కురిసింది. రెండుగంటలకు పైగా వర్షం కురవడంతో మండలంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు విద్యుత్ పునరుద్దరణ చర్యలు చేపట్టారు.విద్యానగర్‌లోని గూడలికి వేళ్లే రహదారిపై రెండు అడుగులు నీటి ప్రవాహంతో అ ప్రాంతంలో ద్వీచక్రవాహనదారులు వేళ్లే లేక ఇబ్బందిపడ్డారు. ప్రతి సారి ఇదే సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్న ఆటుఅధికారులు ఇటు కూటమినాయకులు పట్టించుకొవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.కనీసం ఆగుంటలో కొంత మేరకంకర చిప్స్ తోలిన కొంతమేర ప్రజల కష్టాల తీరుతాయి.

## అంకితభావంతో నాణ్యమైన వైద్య సేవలు అందించండి

### - 14 మంది వైద్యులకు నియామక పత్రాలను అందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూన్ 22, ప్రభతవార్త - కలెక్టరేట్** అంకితభావంతో నాణ్య మైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. సోమవారం నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో, జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపికైన 14 మంది వైద్యులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నియామక పత్రాలను అందజేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆదేశాల మేరకు నిర్వహించిన వాక్ఇన్ రిక్రూట్మెంట్ ప్రక్రియ ద్వారా అభ్యర్థుల ఎంపిక పూర్తిచేయబడిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎంపిక కమిటీ ఆమోదంతో మొత్తం 8 మంది జనరల్ ఎంబీబీఎస్ వైద్యులు, 6 మంది స్పెషలిస్ట్ వైద్యులు ఎంపికై నియామక పత్రాలు పొందినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నియామక పత్రాలు పొందిన వైద్యులు ప్రజాసేవా దృక్పథంతో విధులు నిర్వహించి, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డా. ఎ.కె. పరిమళ మాట్లాడుతూ, నియమితులైన వైద్యులు జిల్లాలోని వివిధ ప్రభుత్వ వైద్య సంస్థల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు నో చెప్పండి

### - యువతకు ఎక్సైజ్ శాఖ అవగాహన సదస్సు



**నెల్లూరు క్రైం, జూన్ 22, ప్రభాతవార్త** మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తుకు పెనుముప్పు అని హెచ్చరిస్తూ, నెల్లూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతను డ్రగ్స్ ఉచ్చు నుంచి కాపాడేలక్ష్యంతో దీనిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు వన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి. రమేష్ బాబు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలతో పాటు చట్టపరమైన తీవ్ర పరిణామాలను విద్యార్థులకు వారు సూటిగా వివరించారు. ఒకసారి మత్తుకు అలవాటు పడితే కుటుంబం, చదువు, జీవితం అన్నీ నాశనమవుతాయి అని ఎక్సైజ్ సీఐ రమేష్ బాబు విద్యార్థులను హెచ్చరించారు. కేవలం మాటలతో కాకుండా, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను వివరిస్తూ రూపొందించిన చిన్న వీడియోను కూడా ప్రదర్శించారు. మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు ఎలా నాశనమవుతాయో, యువత జీవితాలు ఎలా ఛిద్రమవుతాయో ఆ వీడియోలో చూపించడంతో విద్యార్థులు తీవ్రంగా కదిలిపోయారు. ఈ కార్యక్రమం చివరలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది అందరూ చేతులెత్తి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మేము మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాం. సమాజంలో వాటి గురించి అవగాహన కల్పిస్తాం అంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు.

## డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి 2 ఫిర్యాదులు



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ డివిజన్ల నుండి మొత్తం 2 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. ఈ ఫిర్యాదులు ముఖ్యంగా విద్యుత్ అంత రాయం,లో వోల్టేజ్ సమస్యలు, అదనపు ట్రాన్స్ఫార్మర్ తదితర అంశాలకుసంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం డయల్ యు వర్ ఎస్. ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నదని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## నారాయణలో తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఆధునిక పద్ధతిలో అరుదైన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం





**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - వైద్యం** ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తూ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్న నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ మరో అరుదైన ఘనతను సాధించింది. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అరుదైన కిడ్నీ మార్పిడి (కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్) సర్జరీని విజయవంతంగా నిర్వహించింది. ఈఅరుదైన శస్త్రచికిత్సను నెఫ్రాలజీ, యూరాలజీ అనస్థీషియా నిపుణుల బృందం సమన్వయంతో అత్యంత జాగ్రత్తగా నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. హరీష్ రావులపల్లి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సుమారు 130కి పైగా కిడ్నీమార్పిడి సర్జరీలను విజయవంతంగా పూర్తిచేశామని, పేషంట్కు ఎటువంటి ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేయడం జరిగిందని, ఈ ప్రయాణంలో ఈరోజు మరో ముందడుగు వేయడం జరిగిందని, పేషంట్ మరియు కిడ్నీదాత బ్లడ్ గ్రూప్లు మ్యాచ్ కాకపోయినా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విజయవంతం చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ఈ అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నెఫ్రాలజీ విభాగాధిపతి డా. కొల్లా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సాధారణంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్కు కిడ్నీదాత, కిడ్నీ గ్రహీతల యొక్క రక్తపు గ్రూపులు మ్యాచ్అయితేనే ఆపరేషన్ చేయడం జరుగుతుందని, దీనిని ఎబిఓ కంపాటిబుల్ అంటారని, అయితే కిడ్నీ గ్రహీత మరియు కిడ్నీదాతల యొక్క రక్తపు గ్రూపులు వేరుగా ఉంటే దానిని ఎ.బి.ఓ ఇన్కంపాటిబుల్ అంటారని ఇప్పుడు మేము చేసిన సర్జరీలో పేషంట్తో ఓ గ్రూపు, ఆయన భార్యది ఏ గ్రూపు, ప్లాస్మాఫెరిసిస్ అనే పద్ధతిని ఉపయోగించి సర్జరీ చేయడం జరిగిందని, ఆపరేషన్ సమయంలో ఎటువంటి బ్లీడింగ్ కాకుండా, ఆపరేషన్ అనంతరం రిజెక్షన్ కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని యూరాలజీ మరియు అనస్థీషియా వైద్యుల సమిష్టి సహకారంతో చేయడం జరిగిందని, తెలుగు రాష్ట్రాల్లో మొదటగా నారాయణలోనే చేయడం జరిగిందని, సుమారు 10 నుంచి 15 లక్షలు ఖర్చయ్యే ఈ సర్జరీని ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేయడం జరిగిందన్నారు. అనంతరం యూరాలజీ విభాగాధిపతి డా. వేదమూర్తిరెడ్డి మాట్లాడుతూ ఎ.బి.ఓ ఇన్కంపాటబుల్ సర్జరీలో అపరేషన్ సమయంలో అధిక రక్తస్రావం జరగకుండా నిపుణులైన యూరాలజీ బృందం సహకారంతో విజయవంతంగా సర్జరీ నిర్వహించామని తెలిపారు. అలాగే రొబోటిక్ ద్వారా మూత్ర నాళ,మూత్రకోశ సమస్యలకు చికిత్సలు అందిస్తున్నామని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనస్థీషియా వైద్యులు డా. ప్రభావతి మాట్లాడుతూ కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ పేషంట్కు బ్లషర్ చాలా ఎక్కువగా ఉంటుందని, అలాగే యూరిన్ అవుట్పుట్ తదితర సమస్యలను నియంత్రించే అనుభవజ్ఞులైన మత్తువైద్య నిపుణుల బృందం నారాయణ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నందునే పూర్తి సహకారాన్ని అందించగల్గుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. హరీష్ రావులపల్లి, నెఫ్రాలజీ విభాగధిపతి డా. కొల్లా ప్రవీణ్ కుమార్, యూరాలజీ విభాగాధిపతి డా. వేదమూర్తిరెడ్డి, డా. యువరాజ్, మెడికల్ సూపరింటెండెంట్, అనస్థీషియా వైద్యులు డా. ఆర్. ప్రభావతి, డా. దీప్తి, హాస్పిటల్ ఏజీఎం ఎ.సి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా: ఎమ్మెల్యే ప్రజాదర్బార్



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త** : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి వేగవం తమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేదగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం పటణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌కు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాటిపై తక్షణచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరస్కారంకు చర్యలు తీసుకొంటానని తెలిపారు. ప్రజాధర్బార్ వంటి కార్యక్రమాలతో ప్రజలతో ప్రత్యేక్షంగా కలిసే అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## కార్పొరేషన్ పిజిఆర్ఎస్‌లో 45 వినతులు



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నగరపాలకసంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వై. నందన్ లుపాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి సంబంఇంచిన విభాగాల అధికారుల ద్వారా శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 17, టౌన్‌ప్లానింగ్ 7, రెవెన్యూ 3, పెన్షన్ 3, ఇంజనీరింగ్ 7, ఆప్కాస్ 1, అకౌంట్‌సెక్షన్ 1, పబ్లిక్ హెల్త్ 5, హెచ్ సెక్షన్ 1, మొత్తం 45 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ. రహంతుజానీ, ఈఈలు శేషగిరిరావు, అనీల్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దినేష్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, టౌన్‌ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథ్‌రావు, ఏసీపీలు వేణు, సతీష్, ఉద్యానవనశాఖ అధికారి నరసింహారావు, టిపిఆర్ఓ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు మిషన్ ట్రాన్స్‌ప్లాంటర్‌పై అవగాహన



**సైదాపురం, జూన్ 22, ప్రభాతవార్త** మండల పరిధిలోని కలిచేడు గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ రైతులకు మిషన్ ట్రాన్స్ ప్లాంటర్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు వరి వేసే రైతులకు మిషన్ ట్రాన్స్ ప్లాంటేషన్‌తో వరి వేయడం ద్వారా రైతులకు తగ్గే ఖర్చులు, కూలీలపై అవగాహన కల్పించారు. అలాగే ఫెరోమోన్‌ట్రాప్స్ పెట్టడం ద్వారా పురుగుల ఉద్పతిని గుర్తించి, స్ప్రెరింగ్స్ కూడా తగ్గించడం జరుగుతుందని తెలిపారు. ఈ మిషన్ ద్వారా సాగుబడి ఖర్చు తగ్గించుకుని రైతులు ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. అలాగే పీఎస్‌బీ, కేఆర్‌బీ వంటి జీవన ఎరువులను వాడటం వలన భూమిలో ఉన్నటువంటి కరగని స్థితిలో ఉన్న పోస్పరస్‌ను కరిగే స్థితికి తీసుకురావడమే కాకుండా మొక్కకు అందే విషయంలో కూడా తోడ్పడుతుందని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసీల్దార్



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త** : కోవూరులోని పలు పోలింగ్ బూత్‌ల పరిసరాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సోమవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బీఎల్‌వోలు ఆ బూత్ పరిధిలో ఓటు హక్కు కలిగిన వారింటికి వెళ్లి ఫారాలు అందజేస్తారని, సంబంధిత ఇంటి యజమాని దానిని పరిశీలించి తగు సమాచారాన్ని తిరిగి బీఎల్‌వోకు అందజేయాలన్నారు. ఈ ప్రక్రియలో బీఎల్‌వోకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉన్నా వెంటనే సూపర్‌వైజర్లను, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ పరిశీలనలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, బీఎల్‌వోలు ఉన్నారు.

## రూ.48లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేచే శ్రీకారం



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న సంకల్పతంతో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రూ.48లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక వైకుంటపురంలోని అనగగుంట ముంపు ప్రాంతాలను సోమవారం పరిశీలించి అక్కడ చేపట్టనున్న సిసిరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, అనపగుంట కల్వర్టు ప్రారంభించబోయే పనులను పరిశీలించారు. ఈ పనులన్నీ నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ముంపు, రోడ్లు, మురుగునీటి కాలువల వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించుకొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా పనులుచేపడుతామని ప్రజలకు తెలిపారు. సిఎం, డిప్యూటి సిఎం, మంత్రిల ఆశీస్సులతో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింతముందుకు తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సి పల్ కమిషనర్ శ్రావన్‌కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వరం జొన్నవాడ పిహెచ్‌సి

## కార్పోరేట్ హాస్పటల్స్‌కి దీటుగా జొన్నవాడ పిహెచ్‌సి







**బుచ్చి జూన్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ పిహెచ్‌సి పేద ప్రజలకు వరంగా మారిందని చెప్పవచ్చు. కార్పోరేటు హాస్పటల్‌కి దీటుగా ప్రభుత్వం ఇక్కడ అన్ని వసతులు ఏర్పాటు చేసింది. పిహెచ్‌సిలో ఇన్ పేసింట్లకు వార్డులో ఏసి సౌకర్యం, చిన్నపిల్లలకు బేబి వార్మర్, బిడ్డ పుట్టిన వెంటనే వెచ్చదనం కోసం సదుపాయం కల్పించడం జరిగింది. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అహ్మద్‌భాషా మాట్లాడుతు పురుగు మందు త్రాగి వచ్చిన వారి కోసం స్టమక్ వాష్ కొరకు సస్టైన్ ఆపరేటర్ మిషన్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నెలకు రెండు సాధారణ కాన్పులు తప్పకుండా జరుగుతాయని తెలిపారు. అత్యాధునిక ఇసిజి మిషన్, పల్స్, ఆక్సజన్ చూసేందు కు వాల్‌మెయిన్‌టర్స్, డిస్ఇన్‌పెక్షన్ చేసేం దుకు పామ్‌కేషన్ మిషన్ వంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పించడం జరిగిందని అన్నారు. పేషేంట్స్‌కి వాటర్ ప్రూఫ్ ద్వారా త్రాగునీటి సౌకర్యం కల్పిస్తు 24/7 పిహెచ్‌సిలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటు ప్రజలకు వైద్యసదుపాయాలు అందించడం జరుగుతుందని అన్నారు." కుక్కకాటుకు, పాముకాటుకి " సంబందించిన ఎఎస్‌వి, ఆఆర్‌వి ఇంజక్షన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాయిసన్ తీసుకున్నవారికి పామ్ ఇంజక్షన్ కూడా అందుబాటులో ఉన్నయాని తెలిపారు. ప్రజలు పిహెచ్‌సిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పిహెచ్‌సిలో ఓపి నిత్యం సుమారు 70 మంది వరకు వస్తుంటారని తెలిపారు. ప్రభుత్వం కార్పోరేట్ హాస్పటల్స్‌కి దీటుగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

## పీర్ల చావిడిలో మొహరం పూజలు ప్రారంభం





**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** కోవూరులోని బజార్ సెంటర్‌లో ఉన్న పీర్ల చావిడిలో రానున్న మొహరం పర్వదినం సందర్భంగా పీర్లకు సాంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో ముజావర్లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పీర్ల చావిడి ప్రాంతాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా పీర్ల చావిడిలో ముజావర్లు వచ్చిన భక్తులకు ప్రత్యేక పూజలను చేపట్టి ప్రసాదాన్ని పంచి పెట్టారు.

## వసతి గృహాలు పిలుస్తున్నాయ్

### ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కోట, జూన్ 22 ప్రభాతవార్త** నిరుపేద విద్యార్థుల కోసం జిల్లాలో ,వెనుకబడిన సంక్షేమ, వసతి గృహాలు నెలకొల్పి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుంది. ఆధునాతన సదుపాయాలతో ఇంటిని మరిపించేలా నాణ్యమైన భోజనంతో పాటు అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. మెరుగైన విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు అందించే గురుకులాల్లో సీట్లు కోసం పోటీ పడుతున్న విద్యార్దులు వాటికీ ధీటుగా అనేక సదుపాయాలు కల్పిస్తున్నారు. జిల్లాలో కోట్లాదిరూపాయాల వ్యయంతో గత సంత్సరం కార్పోరేట్ సంస్థలకు దీటుగా జిల్లాలోని అన్ని బిసివసతి గృహాలను బాగు చేశారు. దీంతో హస్టల విద్యార్దుల తల్లిదండ్రులు కూడా ఏం తోగాను సంతోష పడ్డారు. ప్రస్తుతం హస్టళ్లల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. జిల్లాలో 6 వేల సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం 2500 మంది విద్యార్దులు చేరారు. ఇంకా విద్యార్దులు ఏప్రాంతం వారైన జిల్లాలో ఆయా బిసి వసతి గృహాల్లో చేరవచ్చుని జిల్లా బిసి సంక్షేమ శాఖఅధికారిణి వెంకటలక్ష్మీ ప్రభాతవార్త కు చెప్పారు.

## ఎల్‌నినో తో పంటలు మార్పుడి చేసుకొండి

### ఎం ఎం.సుచ్చేంద్రప్రసాద్ పిలుపు



**కోట, జూన్ 22 ప్రభాతవార్త** ఈఏడాది నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి వారం రోజులవుతున్నా వర్షాలు జాడకానరావడం లేదని జూన్ సగం మాసం పూర్తయినా అధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఈ నేపధ్యంలో ఈ ఏడాది భిన్నమైన వాతావరణ పరిస్దితులు కనిపిస్తున్నాయి. దీనికి తోడు ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ఇప్పటికే వాతావంణ శాఖ శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపధ్యలంలో ప్రభుత్వం కూడా మండల స్దాయి అధికారులను గ్రామాలకు పంపి ఎల్‌నినో ప్రభావంతో పంటలు మార్పుడి సాగు చేయాని సూచిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం కోట మండల వ్యవసాయాధికారి ఎం.సుచ్చేంద్రప్రసాద్ తిమ్మానాయుడుపాళెం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగు చేయాలని, భూ ములు బీడు లేకుండా చూడాలని, బీడు ఉంటే మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. దీనికి తోడు నీటి వనరులు తుక్కవగా ఉన్న ప్రాంతాల్లో సోయాబీన్ సాగు చేయాలని ఆయన కోరారు. తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలన్నారు. సూక్ష్మ నీటి సాగు పద్దతులను పాటించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ చేయండి, తద్వారా నేల తేమను నిల్వవుంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఎఫ్ఎస్ యూప్ ద్వారా యూరియాను బుకింగ్ చేసుకోవాలన్నారు. స్టాక్ అందుబాటులో ఉందని క్యూఆర్ కోడ్ చూపించి ఎరువు తీసుకొచ్చానారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి సాయి, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో కారుణ్య నియామకాలు



**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన ఉద్యోగస్తుల కుటుంబాలను ఇతోదికంగా ఆదుకునే ఉద్దేశంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో అందించారు. అందులో భాగంగా కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తు మరణించిన షేక్ అల్తాఫ్ అహ్మద్ కూతురు షేక్ అస్నా సుల్తానాకు జూనియర్ అసిస్టెంట్ ట్రెజరీ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. అదే విధంగా ఏపీఎస్ఆర్టీసీలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఎం. శ్రీనివాసులు కుమారుడు ఎం. వెంకట తరుణ్ తేజకు డిజిటల్ అసిస్టెంట్‌గా పంచాయతీరాజ్ శాఖలో నియమిస్తూ కారు ణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా విధుల్లో చేరబోతున్న ఉద్యోగస్తులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పై అధికారులు సూచనలు తూచా తప్పకుండా పాటించాలని పనిచేస్తున్న శాఖలకు మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేయాలి అన్నారు.

## ఏరియా వైద్యశాలను సందర్శించి పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సందర్శించి ఆసుపత్రిలో పనితీరును వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న కొండాపురం మండలం వెలిగండ్ల గ్రామంలో జరిగిన దాడి ఘటనలో న్యాయవాది మంజుశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులు వరలక్ష్మి, కోటేశ్వరరావులను పరామర్శించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. కావలి ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలలోనే అత్యుత్తమ వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిత, ఆర్ఎంఓ ప్రమీల, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, వైద్యశాల కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

## బహిరంగ మద్యపానం వద్దు అనే పోస్టర్ ఆవిష్కరణ



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త** :మంగళగిరి ప్రొహిబిషన్ డైరెక్టర్ఆఫ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సు మెంటు వింగ్ పి.దయాసాగర్ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ మద్యపానం వద్దు తోటివారికి ఇబ్బంది కలిగించవద్దు అనే నినాదంతో పోస్టర్‌ను స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు వద్ద అంటించి లైసెన్స్‌దారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించడం జరిగింది. సిబ్బందితో కలిసి నేరాలగురించి దాడులు నిర్వహించగా ఉదయగిరి రోడ్డులో విద్యుత్‌కార్యాలయం ముందు బహిరంగగా మద్యంసేవిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.ప్రసన్నకుమార్, హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల భూ వివాదాలను తక్షణమే పరిష్కరించాలి



**కావలి, జూన్ 22 ప్రభాతవార్త** :రైతాంగం ఎదుర్కొంటున్న భూ వివాదాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులు సోమవారం ఒకటవ పట్టణ అధ్యక్షుడు మందకిరణ్‌కుమార్ ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రాన్ని ఆర్డీఓ ఎలీసాబాబుకు అందజేశారు. బిజెపినాయకులు మాట్లాడుతూ డివిజన్‌పరిదిలోని పలు మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ భూ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అల్లూరు మండలం పురిణి గ్రామానికి చెందిన రైతు సుధాకర్ భూ సమస్యను పరిష్కరించాలని, విజమూరు మండలానికి చెందిన గోసు సుజాత భర్త బిక్షమయ్య కుటుంబానికి చెందిన భూమిని అదే కుటుంబానికి చెందిన కొందరు వ్యక్తులు అడంగల్‌లో పేర్లు మార్చి ఆక్రమాలకు పాల్పడుతున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకున్యాయం చేయాలన్నారు. దగదర్తి మండల కౌరగుంట గ్రామానికి చెందిన భూ వివాదానికి సంబంధించిన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియాకొరతపై అగ్రికల్చర్ అధికారులతో చర్చించగా ప్రస్తుతానికి ఎక్కడా యూరియా కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. హౌసింగ్ విభాగంలో గత ప్రభుత్వ హాయాంలో భారీ ఆక్రమాలు జరిగాయని, దీనిపై విచారణ జరిపి ఆక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెఇప రాష్ట్ర సహాకోశాధికారి కందుకూరి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సబ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, కావలి డివిజన్ జనతావారది ఇన్‌చార్జ్ కుట్టుబోయిన బ్రహ్మందనం జిల్లా కోశాధికారి సివిసి సత్యం, ఎస్‌సి మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, బిజెవైఎం జిల్లా కార్యవర్గసభ్యులు పల్లపోతుల సాయిక్రిష్ణ, పట్టణ కార్యదర్శి శ్రీనిక్‌కుమార్ జైన్, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తి కావాలి



**కోవూరు, జూన్22 ప్రభాతవార్త :** కోవూరులోని బీసీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ నిశితంగా పరిశీలించారు. మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న పనులు మరింత వేగవంతం కావడమే కాకుండా సకాలంలో పూర్తయ్యేలా పనులు పొందిన కాంట్రాక్టర్ తగు చొరవ తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయన పాటూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు కూడా పరిశీలించి ఏఈకి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ జగదీష్, తదితరులు ఉన్నారు.

## సాంప్రదాయబద్ధంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 22ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కా లమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శివభక్త బృందం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన చైర్మన్ సురేష్, శివ భక్త బృందం సభ్యులు సుకుమార్, జనార్దన్, మోహన్, శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.